# నియమావళిని కచ్చితంగా పాటించాలి

## మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, నవంబర్ 20 : ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పోలీసు పరిశీలకులు ఇలంగోతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 30న పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు బెల్లంపల్లి నియోజకవర్గంలో 152 మంది, చెన్నూరు నియోజకవర్గంలో 40, మంచిర్యాల నియోజకవర్గంలో 138 మందికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం శాసనసభ అభ్యర్థి రూ. 40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని, అంతకు మించి చేయరాదన్నారు. జిల్లాలో మొత్తం 743 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటరు జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అందించినట్లు చెప్పారు. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు నస్పూర్‌లోని సింగరేణి అతిథి గృహంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు అందుబాటులో ఉంటారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల సమస్యల పరిష్కారం, దరఖాస్తులు, ఫిర్యాదు కోసం సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా పోలీసు పరిశీలకులు ఇలంగో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో బూత్ ఏజెన్సీల ఏర్పాటుతో పాటు వర్రీ లిస్టు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీల అభ్యర్థనల మేరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం అదనపు రక్షణ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ సమస్యల పరిష్కారం కోసం 8143694203లో సంప్రదించాలని, అలాగే ఎన్నికల శాంతి భద్రతలకు సంబంధించి ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబర్ 9497997900లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

# పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు బిశ్వజిత్ దుత్తా

*బెల్లంపల్లి, నవంబర్ 20: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం బెల్లంపల్లి ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దుత్తా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులపై సంబంధిత సెక్టోరియల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పోలింగ్ సిబ్బంది ఓటర్లకు సరిపడా స్థలం ఉందా లేదా అని ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను గమనించారు. ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఎన్నికల అధికారులు, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీల్,ఎస్‌ఐ రమేశ్ తదితరులున్నారు.*

### సెక్టోరియల్ అధికారులకు మాక్ పోలింగ్

*బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈవీఎంల వినియోగంపై మాక్ పోలింగ్ నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి రాహుల్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఈనెల 30న నిర్వహించనున్న ఎన్నికల ఈవీఎంలపై పూర్తిగా అవగాహన కల్పించారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలింగ్ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.*

*జన్నారం, నవంబర్ 20: మండలంలోని హాస్టల్ తండా పంచాయతీలోని టీడబ్ల్యూపీఎస్‌లోని ఎన్నికల పోలింగ్ స్టేషన్‌ను ఐఏఎస్ అధికారి కే గోపాలకృష్ణన్ పరిశీలించారు. నవంబర్ 30వ తేదీన జరిగే శాసన సభ ఎన్నికల నిర్వహణకు కావాల్సిన వసతులతో పాటుగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని మండల అధికారలకు సూచించారు. అయన వెంట తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో రమేశ్ ఉన్నారు.*



జన్నారంలోని హాస్టల్ తండాలో టీడబ్ల్యూపీఎస్‌ను పరిశీలించిన ఐఏఎస్ అధికారి కే గోపాలకృష్ణన్

# ఘనంగా కార్తీక వన భోజనాలు



వన భోజన మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు వినయ్ కుమార్



హాజరైన కమ్మ కులస్తులు

*హాజీపూర్, నవంబర్ 20 : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కమ్మ సేవా సమితి కార్తీక మాస వన భోజనాలు మండలంలోని ఏసీసీ క్వారీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కవి తాళ్లూరి ఆంజనేయులు కమ్మ పుట్టు పూర్వోత్తరాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటా పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అంతకు ముందు వన భోజనాలను జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కమిటీ నాయకులు ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు వడ్డె వినయ్ కుమార్, డాక్టర్ కొల్లి విష్ణువర్ధన్, సభ్యులు, కమ్మ కులస్తులు పాల్గొన్నారు.*

## మద్యం పట్టివేత

దహెగాం, నవంబర్ 20: మండలంలోని చౌక గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం చౌక గ్రామంలో కొలిపాక శ్రీకాంత్ తన కిరాణ షాపులో మద్యాన్ని అమ్ముతున్నట్లు సమాచారం మేరకు షాపులో సోదాలు చేయగా, 9 క్వాటర్, 3 పుల్లు బాటిళ్లు , 10 బీర్లను దొరకగా, వాటిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సోదాల్లో ఎస్ఐ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

CHANGE OF NAME

★ I, ANITHA KUMARI, R/o: 4-2-164/B/1, Rani Sathiji Colony, Adilabad, Telangana-504 001. Changed My Name as "ANITA KUMARI JAISWAL".
NT-320290

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## బీఆర్ఎస్ పార్టీకి ట్రస్మా సంపూర్ణ మద్దతు



యాదగిరి శేఖర్‌రావు

జన్నారం, నవంబర్ 20: నవంబర్ 30వ తేదిన జరిగే శాసన సభ ఎన్నికల్లో ట్రస్మా బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతునిస్తున్నామని ట్రస్మా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో అయన మాట్లాడారు. ఇప్పటికే ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం, ఖానాపూర్,కడెం మండలాల్లో ట్రస్మా ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉట్నూర్‌లో మంగళవారం సంఘ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ట్రస్మా సభ్యులందరూ సహకరించి జాన్సన్ నాయక్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

## గంజాయి పట్టివేత

కాగజ్‌నగర్, నవంబర్ 20: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం గ్రామానికి వెళ్లేదారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, అక్రమం తరలిస్తున్న గంజాయి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణప్రతాప్ సోమవారం తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కే సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఇద్దరు ద్విచక్రవాహన దారుల వద్ద 1.4 కిలోల గంజాయి లభించిదని స్పష్టం చేశారు. గంజాయి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. ఈజ్‌గాం విలేజ్ నంబర్-9 గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు కాగజ్‌నగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను విచారించగా మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చి జిల్లాలోని వివిధ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారని తెలిపారు. గంజాయి, విక్రయదారులు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సందీప్, కానిస్టేబుల్ రమేశ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి ఒకరి మృతి

జన్నారం, నవంబర్ 20: మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన జువ్వాడి చిన్నరాజలింగు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 17వ తేదీన జువ్వాడి చిన్నరాజలింగు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం రెండు రోజులపాటు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం అదే గ్రామానికి చెందిన నక్క చిన్న ముజ్జన్న పత్తి చేసుకు వెళ్లి, నీరు పెట్టడానికి బావి వద్దకు వెళ్లగా, అందులో మృతదేహం కనిపించింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. చిన్నరాజలింగు భార్య జువ్వాడి లక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సీసీసీ నస్పూర్, నవంబర్ 20: సీసీసీ సమీపంలోని 363 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బోడ శంకర్(37) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేట మండలం సోమగూడెం లంబడితండాకు చెందిన బోడ శంకర్ కూలీగా పని చేస్తున్నాడు. తన కొడుకును ద్విచక్ర వాహనంపై సోమవారం జైపూర్ గురుకుల పాఠశాలకు తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో సీసీసీ, దొరగారిపల్లె సమీప జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు విచారణ చేపడుతున్నారు.